




RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ | శనివారం 31-08-2024 | ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ | సంపుటి : 06 | సంచిక : 230 | పేజీలు : 4 | వెల : రూ 2-00

PUBLISHED : NIZAMABAD | SATURDAY 31 AUGUST 2024 | EDITOR : BYAGAL SRINIVAS | VOLUME : 06 ISSUE : 230 | PAGES : 4 Rs : 2.00


## రుణమాఫీ అమలులో విఫలం: అర్వింద్

నిజామాబాద్,ఆగస్ట్30 రైతు రుణమాఫీ అమలులో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో రుణమాఫీ పేరుతో రైతులను రేవంత్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. మొదటి హామీ అమలులోనే కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నటికీ విలీనం కాదని స్పష్టంచేశారు. కనీసం సగం మందికి కూడా రుణాలు మాఫీ చేయలేదన్నారు. రేవంత్ రెడ్డి రొటేషన్ చక్రవర్తిలా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తే.. కనీసం సగం మందికి కూడా చేయలేదని విమర్శించారు. జిల్లాలో రైతు రుణమాఫీ కేవలం 30 శాతం మాత్రమే జరిగిందని వివరించారు. గత పాలకులకు, రేవంత్ రెడ్డికి తేడా లేదన్నారు.

# టిటిడి తరహాలో యాదగిరిగుట్ట అభివృద్ధి



### యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు
### హైదరాబాద్ బయట మరో జూపార్క్
### స్పీడ్ ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్,ఆగస్ట్30( ): రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి నూతన విధానం రూపొందించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. 'స్పీడ్' ప్రాజెక్టులపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఎకో, టెంపుల్ పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలని చెప్పారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాదగిరిగుట్ట అభివృద్ధిపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. తితిదే బోర్డు మాదిరే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధిలో పెండింగ్ పనుల వివరాలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై వివరాలు ఇవ్వాలని సూచించారు. ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులు వేగవంతం చేయాలన్నారు. ఆలయ అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆపవద్దని స్పష్టం చేశారు. వైటీడీఏ, యాదగిరిగుట్టకు సంబంధించి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతి కుమారి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటన

### శిరసు వంచి క్షమాపణలు కోరిన ప్రధాని మోడీ



ముంబయి,ఆగస్ట్30( ): మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటనపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై తాజాగా ప్రధాని మోదీ క్షమాపణలు తెలియజేశారు. 'నేను ఇక్కడ దిగిన వెంటనే.. విగ్రహం కూలడంపై శివాజీకి క్షమాపణలు చెప్పాను. ఈ ఘటన వల్ల బాధకు గురైన వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను' అని వెల్లడించారు. 'ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను తమ దైవంగా భావించేవారు ఈ ఘటనతో తీవ్ర వేదనకు గురయ్యారు. నా తలవంచి వారికి క్షమాపణలు చెబుతున్నా. మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదు' అని మోదీ మాట్లాడారు. శుక్రవారం మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ విధంగా స్పందించారు. ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కొద్దిరోజుల క్రితం కుప్పకూలిపోయింది. 35 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని గతేడాది డిసెంబరు 4న నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ ఆవిష్కరించారు. రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగానే విగ్రహం కూలినట్లు భావిస్తున్నామని, అసలు కారణాన్ని నిపుణులు త్వరలోనే వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. కాగా, తొమ్మిది నెలలు కూడా పూర్తికాకుండానే విగ్రహం కూలిపోవడం పట్ల ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రాష్ట్రప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న దృష్టి, నాణ్యత మీద లేదని దుయ్యబట్టాయి.

# ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న రేవంత్ సర్కార్: హరీశ్‌రావు




హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అభివృద్ధి కాంక్షను పక్కనబెట్టి, రాజకీయ కక్షతో ముందుకు వెళ్లడం గర్హనీయమని విమర్శించారు. రేవంత్ రెడ్డి దివాళాకోరు రాజకీయాలకు ఇది పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద 33 జిల్లాల్లో మంజూరైన సుమారు రూ.10 వేల కోట్ల విలువ చేసే 34,511 పనులను రద్దు చేయడమే దీనికి నిదర్శనమన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ వివరాలను బయటపెట్టిందంటూ ఎక్స్ వేదికగా వెల్లడించారు.'రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా మంజూరైన అనేక పనులను నిలిపివేయడంతో పాటు, ఇప్పటికే ప్రారంభమైన అనేక పనులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించొద్దని మధ్యంతరంగా నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దాదాపు పూర్తి కావొస్తున్న ప్రాజెక్టులకు సైతం బిల్లుల చెల్లింపులు నిలిపివేసింది. దీంతో రాష్ట్రంలోని దాదాపు ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్, మున్సిపల్, రోడ్లు-భవనాలు, నీటిపారుదల తదితర శాఖలపరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రక్రియకు ఆటంకం కలిగింది. దీంతో ఎంతో మంది ఉపాధి కూడా కోల్పోతున్నారు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి నిరోధక అజెండాతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వానికి కొత్త పనులను చేపట్టే శక్తిసామర్థ్యాలు లేవని ఇప్పటికే తేలిపోగా, మంజూరైన పనులను పూర్తి చేసే కనీస నైతిక బాధ్యత కూడా లేదని పనుల రద్దుతో స్పష్టమైంది.కాంగ్రెస్ పాలన ప్రజలకు శాపంగా మారింది. అభివృద్ధి నిరోధకులుగా ముఖ్యమంత్రి వ్యవరిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గాలకు కేటాయించిన ఎస్డీఎఫ్ నిధులను ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసింది. అయితే ఈ నిధుల నుండే మార్చి నెలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు 10 కోట్ల చొప్పున మంజూరు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రమే నిధులు ఇచ్చి తన కురచ బుద్ధిని, పక్షపాత ధోరణిని చూపింది.

# మహిళల భద్రతకుమరింత కఠినంగా చట్టాలు

### కోల్‌కతా ఘటన నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్య




న్యూఢిల్లీ,ఆగస్ట్30( ): పశ్చిమ బెంగాల్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈనేపథ్యంలో దేశంలో మహిళల భద్రత కోసం ఇంకా ఎంతో చేయాల్సి ఉందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ దిశగా ప్రభుత్వం తీవ్ర యోచన చేస్తోందని అన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. 'అత్యాచారం వంటి నేరాలకు మరణశిక్ష విధించేలా చట్టాలను సవరిం చాం. ఆ చట్టాలను కఠినంగా అమలుచేయా లి. దేశంలో మహిళలపై జరుగుతోన్న అఘాయిత్యాలు, నేరాలు చూస్తుంటే.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉ ందనిపిస్తోంది. మహిళలపై జరుగుతోన్న నేరాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరిని అవలంబిస్తోంది. ఆ దిశగా కొన్ని రాష్ట్రాలు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన అమానవీయమైనది' అని మంత్రి పోస్టు పెట్టారు. అలాగే తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన రాజ్‌నాథ్.. మహిళల భద్రత అంశాన్ని ప్రస్తావించారు. అభివృద్ధిలో స్త్రీల భాగస్వామ్యం తమ ప్రభుత్వ హయాంలో భారీగా పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం గురించి ప్రస్తావించారు. తమ ప్రభుత్వం తీసుకున్న చొరవ వల్ల హరియాణా వంటి రాష్ట్రాల్లో లింగనిష్పత్తిలో మెరుగుదల కనిపించిదని చెప్పారు. 'స్వాతంత్ర్యం÷-ర తర్వాత.. ఈ దేశ అభివృద్ధిలో మహిళలకు తగిన ప్రాధాన్యం లభించలేదు. కానీ ఇప్పుడు ఈ పరిస్థితిలో అనూహ్య మార్పు వస్తోంది. దేశ భద్రతా బలగాల్లో మహిళల పాత్ర పెరుగుతుండటమే అందుకు నిదర్శనం' అని తెలిపారు. కొన్ని రోజుల క్రితం బెంగాల్‌లోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో రాత్రి సమయంలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అఘాయిత్యం జరిగింది. ఆ మరునటి రోజు ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఈ కేసులో పోలీసు వాలంటీర్ అయిన నిందితుడు సంజయ్‌రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ కేసును కలకత్తా హైకోర్టు.. సీబీఐకి బదిలీ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని విపక్షాలు, పలు సంఘాలు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తంచేస్తున్నాయి. ఈనేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం అత్యాచారాల నిరోధకానికి కొత్త బిల్లు తీసుకురాబోతోంది. కఠిన నిబంధనలతో రూపొందిస్తున్న ఈ బిల్లు ప్రకారం దోషులుగా తేలిన వ్యక్తులకు మరణ దండన విధించే అవకాశం ఉంటుందని శాసనసభ వ్యవహారాల మంత్రి సోవన్‌దేబ్ ఛటోపాధ్యాయ్ వెల్లడించారు. బిల్లును సభలో సమగ్రంగా చర్చించి ఆమోదించడం కోసం సెప్టెంబరు 2 నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు స్పీకర్ బిమన్ బెనర్జీ తెలిపారు.

# త్వరలో 'భారత్ డోజో యాత్ర'

### మార్షల్ ఆర్ట్స్‌ను యూత్‌కు పరిచయం చేసే లక్ష్యం
### వీడియో షేర్ చేసిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,ఆగస్ట్30( ): త్వరలో తాను 'భారత్ డోజో యాత్ర' చేపడతానని లోక్ సభా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వెల్లడించారు. మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ సెంటర్లను డోజోగా పిలుస్తారని తెలిపారు. మెడిటేషన్, జివూ- జిట్సూ(బ్రెజిల్ మార్షల్ ఆర్ట్స్), ఐకిడో (జపాన్ మార్షల్ ఆర్ట్స్) వంటి ఆర్ట్స్ లను ఉపయోగించి అహింసతో ఘర్షణలను పరిష్కరించే పద్ధతులు యువతకు పరిచయం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. గురువారం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా రాహుల్ గాంధీ.. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్ర చేసే టైంలో తమ శిబిరాల వద్ద జరిగిన మార్షల్ ఆర్ట్స్ సెషన్ వీడియోను ఎక్స్ లో షేర్ చేశారు. ఆ వీడియోలో స్టూడెంట్లకు రాహుల్ మార్షల్ ఆర్ట్స్ సెషన్స్ నిర్వహించారు. తనకు ఐకిడోలో బ్లాక్ బెల్ట్, జివూ -జిట్సూలో బ్లూ బెల్ట్ ఉందని తెలిపారు. తన వీడియో ద్వారా కొందరిలోనైనా ఈ ఆర్ట్స్ నేర్చుకోవాలనే ఇంట్రస్ట్ రావాలని ఆశించారు. 'మేం వేల కిలోమీటర్లు జోడో యాత్ర చేశాం. ఆ టైంలో మా శిబిరాల వద్ద ప్రతిరోజు జివు-జిట్సూ ప్రాక్టీస్ చేసేవాళ్లం. ఫిట్ గా ఉ ండేందుకు మేం ప్రారంభించిన యాక్టివిటీ అందరికీ చేరువైంది.

మేం బస చేసిన ప్రాంతాల్లోని తోటి యాత్రికులు, యువ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులను ఒకచోటకు చేర్చింది. మెడిటేషన్, జివూ-జిట్సూ, ఐకిడోల వంటి జెంటిల్ ఆర్ట్స్ ను యువతకు పరిచయం చేయడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. దీనిద్వారా ఘర్షణ వాతావరణాన్ని సౌమ్యంగా మార్చే విలువల్ని వారిలో పెంపొందించాలని, దయ, సురక్షితమైన సమాజం కోసం కావాల్సిన సాధనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకే త్వరలో భారత్ డోజో యాత్ర చేపట్టాలని నిర్ణయించాం' అని రాహుల్ ట్వీట్ చేశారు. రాహుల్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' మొత్తం 110 జిల్లాలు, 100 లోక్ సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 60 రోజులకుపైగా 6,713 కిలోమీటర్ల మేర కొనసాగింది. అంతకుముందు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడోయాత్ర' ను నిర్వహించారు.

# 15 ఏళ్లుగా నత్తనడకన దేవాదుల ప్రాజెక్ట్

### దేవాదుల ప్రాజెక్టును సందర్శించిన మంత్రుల బృందం
### పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించిన మంత్రులు
### ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి.. పనుల పురోగతిపై సమీక్ష

ములుగు,ఆగస్ట్30( ): 15 ఏళ్లుగా దేవదుల ప్రాజెక్ట్ నత్తనడకగా సాగుతోందని, 2026 మార్చి నాటికి పూర్తి చేసి, సోనియా గాంధీతో ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. 300 రోజుల పాటు నీటి ఎత్తిపోసేలా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తాం అన్నారు.. పెండింగ్ బిల్ అన్ని క్లియర్ చేస్తాం అన్న మంత్రులు.. పొరుగు రాష్ట్రాల తో సత్ సంబంధాలతో ఉంది త్వరితగతిన ప్రాజెక్టు పనుల చేపడతాం అన్నారు. గత ప్రభుత్వం కేవలం పనులు చేశారు జేబులు నింపుకున్నారు కానీ ప్రజలకు లాభం జరగలేదు. లక్ష 80 వేల కోట్లు ఇరిగేషన్ శాఖ పైనా ఖర్చు చేసిన గత బిఆర్ఎస్ పాలకులు పనుల పేరుతో జేబులు నింపుకున్నరని అన్నారు. ప్రాజెక్టుల పని పేరుతో గత ప్రభుత్వా నేతలు దోచుకున్నారని విమర్శించారు. ములుగు జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల పంపింగ్



స్టేషన్ ను సందర్శించి, ప్రాజెక్టు ఇంటెక్ వెల్, పంప్ హౌస్ ను పరిశీలించారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయడంపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.

# హిమాయత్ సాగర్ వైపు హైడ్రా చూపు

### అక్కడి జలాశయ ఆక్రమణలపై నివేదిక
### పూర్తిస్తాయి సమాచారంతో ఇక రంగంలోకి

హైదరాబాద్,ఆగస్ట్30 బుల్డోజర్లు ఇక హిమాయత్‌సాగర్ వైపే సాగనున్నాయి. సాగర్ జలాశయ పరిధిలో అక్రమంగా నిర్మించుకున్న ఫామ్ హౌజ్‌లపై హైడ్రా దృష్టి సారించింది. వివరాలు సేకరించింది. వారంలోగా ఇక్కడి జలాశయంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేశారు. జలమండలి, రెవెన్యూ అధికారులు ఎఫ్‌టీఎల్ (పూర్తిస్థాయి నీటి మట్టం) పరిధిలో ఉన్న నిర్మాణాలను గుర్తించే పక్రియను చేపట్టారు. మొదటి దశలో కొందరు ప్రముఖుల ఫామ్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాలు ఇందులో ఉన్నట్టు తేలింది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలతోపాటు ఇతర పార్టీలు, ప్రముఖుల బంగ్లాలు అందులో ఉన్నాయి. వాటి నుంచి పది భారీ నిర్మాణాలను అధికారులు ఎంపిక చేశారు. అధికార పార్టీ ప్రస్తుత ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రంతోపాటు ఇతర నేతల ఫామ్‌హౌస్‌లు తెరపైకి వచ్చాయి. ఆయా నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ హద్దు లోపల ఎంత వరకు ఉన్నాయి. బఫర్‌జోన్ లోపల, వెలుపల ఎంత మేర ఉన్నాయనే వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని హైడ్రా కార్యాలయం జలమండలి, రెవెన్యూ అధికారులను ఆదేశించింది. వచ్చే సోమవారానికి నివేదికను పూర్తి చేస్తామని అధికారులు గురువారం హైడ్రాకు నివేదించారు. ఈ నెల 11న గండిపేట జలాశయంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశా జరు. కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యాపార వేత్తల ఫామ్‌హౌస్‌లు, హోటళ్లు, క్రీడా ప్రాంగణాలను నగరంలోని తమ్మిడికుంటలో నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చింది. ఈర్ల కుంట, చింతల్‌చెరువు, తదితర తటాకాల్లోని ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణలపైనా దృష్టిపెట్టారు. మొదటి దశలో ఎఫ్‌టీఎల్‌లోని పెద్ద బంగ్లాలను కూల్చుతామని, అనంతరం బఫర్ జోన్‌లోని కట్టడాలను నేలమట్టం చేస్తామంటున్నారు. జలమండలితోపాటు ఇతర శాఖ అధికారులు క్షేత్రస్థాయి

# సంపాదకీయం

శనివారం 31-08-2024

## ఉద్యోగులకు లేని పెన్షన్..పాలకులకు ఎందుకు ?

మోడీ పదేళ్లుగా ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు కలిగింది అని చెప్పడానికి దాఖలాలు లేవు. ప్రధానంగా మధ్య తరగతి ప్రజలను దారుణంగా పీల్చి పిప్పి చేస్తున్నారు. రకరకాల పన్నులు, జిఎస్టీలతో వారి ఆర్థక మూలాలను దెబ్బతీస్తున్నారు. దీనిపై చర్చించడానికి వేదిక లేకుండా పోయింది. జిఎస్టీ బాదుడంతా కేవలం పెద్దల కోసమే తప్ప... సామాన్యులకు కాదని బొంకుతున్నారు. అద్భుతమైన, అందమైన మాటలతో గత పదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నా..చర్చించేవారు లేకుండా పోయారు. ఈ క్రమంలో ఉద్యోగులకు పెన్షన్ స్కీమ్ అన్నది ఎండమావలాగా మారింది. జీవితాంతం ప్రభుత్వ ఉద్యోగులుగా చేసి, రిటైర్‌మెంట్ అయిన వారికి పెన్షన్ ఉండదు. కానీ రాజకీయ నాయకులకు మాత్రం లక్షల్లో జీతాలు పెన్షన్లు అందుతున్నాయి. కేంద్రంలో ఎంపిలకు లక్షల్లో జీతాలు..పెన్న్ష ఉన్నాయి. రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో కూడా అదే విధంగా జీతాలు పెన్షన్లు ఉన్నాయి. వారు మాత్రం చట్టాలు చేసుకుని వేలకోట్ల ప్రజాధనం తమ అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. లక్షల కోట్ల పన్నులు వసూళ్లు అవుతున్నా..ప్రజల అవసరాలు గుర్తించి ఖర్చు చేయడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలకు లక్షల్లో జీతాలు, పెన్షన్లు అవసరా అన్నది గుర్తించడం లేదు. ప్రజలే ఈ విషయంలో నిలదీయాల్సిన అవసరం ఉంది. ఉద్యోగులకు లేని పెన్షన్లు రాజకీయ నేతలకు అవసరామ అన్నది చర్చించాలి. ఉద్యోగులు కానివారికి పెన్షన్లు ఇవ్వడం అనుచితంగా గుర్తించాలి. రాజకీయమంటే కేవంల ప్రజలకు సేవ చేయడం తప్ప మరోటి కాదు. ఈ విషయంలో దేశంలో మేధావులు చర్చించాలి. ప్రజలు కూడా ఆలోచించాలి. ఇకపోతే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం సిపిఎస్ అనేది నాటి వాజ్‌పేయి సర్కారు హయాంలో పురుడు పోసుకుంది. ఇప్పుడు ప్రజల పట్ల ప్రేమ ఒలకబోస్తున్న కాంగ్రెస్ దానని అమలు చేసింది. నాటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో అమల్లోకొచ్చింది. సైనిక రంగ ఉద్యోగులు మినహా 2004 ఏప్రిల్ 1 తర్వాత సర్వీసులో చేరిన వారిని కేంద్రం ఎన్‌పిఎస్‌లోకి చేర్చింది. అప్పటి నుంచి ఉద్యోగులు ఒపిఎస్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మధ్యనే రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఒపిఎస్‌కు వెళ్లాయి. దాంతో కేంద్రంతో పాటు బిజెపి పాలిత రాష్ట్రాలు రాజకీయంగా ఇబ్బందుల్లో పడ్డాయి. కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి సోమనాథన్ నేతృత్వంలో గతేడాది మోడీ సర్కారు కమిటీ వేయగా, అది యుపిఎస్‌ను సిఫారసు చేసింది. ఆ నివేదికకు మోడీ సర్కారు పచ్చజెండా ఊపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిపిఎస్‌ను రద్దు చేస్తామన్న వైసిపి ప్రభుత్వం మాట తప్పి జిపిఎస్ పేరిట విన్యాసాలు చేసింది. అందుకే మొన్నటి ఎన్నికల్లో సిపిఎస్ రద్దు ప్రధాన ఎజెండాగా ముందుకొచ్చింది. దీంతో వైకాపా ప్రభుత్వం మాట తప్పినందుకు మూల్యం చెల్లించు కుంది. టిడిపి ప్రభుత్వం సైతం సిపిఎస్ రద్దు అనకుండా ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పెన్షన్ స్కీం తెస్తామంది. కేంద్రం ప్రతిపాదించిన యుపిఎస్‌పై టిడిపి కూటమి ప్రభుత్వం మౌనం దాల్చింది. ఇదీ దేశ, రాష్ట్ర అభివృద్ధిలో, పాలనలో జీవితాంతం సేవ చేసే ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి. వారిని బానిసలుగా చూస్తూ..వెట్టి చేయించుకుని ముష్టి విదిల్చి పంపాలన్న ఎత్తగడగానే పాలన సాగుతోంది. ఉద్యోగ నియామకలు ఎలాగూ లేవు. ఉన్న ఉద్యోగుకలు కాస్తా పెనషన్ ఎత్తేసి రెండు దశాబ్దాలు అవుతున్నా పట్టించుకోవడం లేదు. సిపిఎస్, రిక్రూట్‌మెంట్ నిలిపివేత, కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ అనేవి ప్రపంచబ్యాంక్ ఆదేశిత, నయా ఉదారవాద విధానాలు. వాటి అడుగు జాడల్లో నడిచే ప్రభుత్వాలకు ఆ విధానాలే శిలాశాసనాలు. ఉద్యోగులకు పెన్షన్ అనేది భిక్ష కాదు, హక్కుగా గుర్తించాలి. ఐదేళ్లు పాలించే వారికే పెన్షన్ ఉంటే 30 ఏళ్లపాటు ఉద్యోగాలు చేస్తున్నవారికి తప్పకుండా పెన్షన్ ఉండాల్సిందే. ఈ తత్వాన్ని పాలకులు అంగీకరించి తీరాలి. ప్రభుత్వాల మెడలు వంచేందుకు ఉద్యోగులు సమైక్యంగా ఉద్యమించాలి. కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రస్తుతం ఉన్న నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పిఎస్) స్థానంలో యూన్గి÷డ్ పెన్షన్ స్కీం (యుపిఎస్)ను తెస్తూ నరేంద్ర మోడీ కేబినెట్ ఇటీవల తీసుకున్న నిర్ణయం మరో ఎన్నికల జిమ్మిక్కు కాక మరోటి కాదు. ఎందుకంటే మోడీ ఏ పనిచేసినా నిజాయితీ ఉండడం లేదని గుర్తించాలి. ఈ ఏడాదిలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోల గట్టెక్కేందుకు ఉద్యోగులకు వేస్తున్న ఎరగా గుర్తించాలి. హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడగా మహారాష్ట్ర ఎన్నికలూ ఇప్పుడే ఉన్నాయి. ఈ సంవత్సరంలోనే ఢిల్లీ, జార్ఖండ్ ఎన్నికలు కూడా రాబోతున్నాయి.. రెండు దశాబ్దాల నుంచి ఎన్‌పిఎస్‌కు నిరసగా ఉద్యోగులు ఆందోళనలు చేస్తుండగా, పదేళ్లుగా కేంద్రంలో తామే అధికారం వెలగబెడుతూ, హఠాత్తుగా పెన్షన్ అంశం మోడీ ప్రభుత్వానికి గుర్తుకు వచ్చిందంటేనే దాని ఎత్తుగడ ఏమిటో తెలియని అమాయకలుఉ కాదు ప్రజలని గుర్తించాలి. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి పట్ల ఉద్యోగుల్లో వ్యక్తమైన తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో సీట్లు తగ్గాయి. అందుకే వారిని ఎలాగైనా మచ్చిక చేసుకునేందుకు పన్నిన పన్నాగంగా అర్థమైపోతుంది. ఇంత డ్రామాకూ ఒడిగట్టి మోడీ సర్కారు ఉద్యోగులకు కొత్తగా ఒరగబెట్టిందేమీ లేదు. ఎన్‌పిఎస్‌లో ఉద్యోగులు తప్పనిసరిగా తమ కంట్రిబ్యూషన్ చెల్లించాలి. చందా లేకుండా పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్) ఉద్యోగుల ప్రధాన డిమాండ్. ఆ మౌలిక అంశాన్ని అంటుకోలేదు మోడీ సంకీర్ణ ప్రభుత్వం. అందుకే యుపిఎస్ పట్ల ఉద్యోగుల నిరసనలు ఎగసిపడుతున్నాయి.ఏకీకృత పెన్షన్ అంటున్నా ఎక్కడా ఏకీకృతం కనిపించదు. పాతిక సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు మాత్రమే బేసిక్‌లో 50 శాతం పెన్షన్ వస్తుంది. మిగిలిన వారికి సర్వీస్ బట్టి పెన్షన్ ఖరారు చేస్తారు. పెన్షన్ పొందాలంటే ఉద్యోగికి కనీసం పదేళ్ల సర్వీస్ నిండి ఉండాలి. కనీస పెన్షన్ రూ.10 వేలే. బేసిక్‌లో యాభై శాతం పెన్షన్‌కు 20 ఏళ్ల సర్వీస్ ఉంటే సరిపోతుంది. కానీ 25 ఏళ్లు నిండాలన్నారు. ఈ నిబంధనలు ఉద్యోగులకు పెన్షన్ గ్యారంటీ ఇచ్చేవేమీ కాదు. ఇదేనా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం కల్పించే ఆర్థిక భద్రత అన్నది ఆలోచన చేయాలి. ఎన్‌పిఎస్‌లో ఉన్న 23 లక్షల మంది యుపిఎస్‌లోకి మారితే గొప్ప ప్రయోజనం అంటోంది మోడీ సర్కారు. రాష్ట్రాలు కలిస్తే 90 లక్షల మందికి మేలు జరుగుతోందంటోంది. ఇదంతా తాము తీసుకొచ్చే యుపిఎస్ స్కీంకు ప్రమోషన్ వర్క్.

## పాతబస్తీ, సల్కం చెరువులో అక్రమణ కూల్చాకే...మిగతావి కూల్చాలి



**చెరువుల ఆక్రమణలను కూల్చడాన్ని బీజేపీ స్వాగతిస్తుంది...**
**సల్కం చెరువులో ఒవైసీ భవనాలకు కావాలనే సమయం ఇస్తున్నారు**
**అయితే ఒకవర్గం వారినే టార్గెట్ చేసి, మిగతా వారిని సేవ్ చేస్తున్నారు.**
**బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

హైదరాబాద్,హైడ్రా కమిషనర్ వ్యవహారం పని తక్కువ పబ్లిసిటీ ఎక్కువ అన్న చందంగా ఉందని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. జనరల్ గా పొలిటీషియన్లు తక్కువ పని చేసి ఎక్కువ పబ్లిసిటీ కోరుకుంటారు. కానీ పొలిటీషియన్లను మించి పబ్లిసిటీ కోరుకుంటున్నారు ఏవీ రంగనాథ్. ఐపిఎస్ అధికారులు వారి వృత్తిలో భాగంగా అవసరమైతనే మీడియాతో మాట్లాడాలి. కానీ రంగనాథ్ తన ఇమేజ్ ప్రమోషన్ కోసం అదే పనిగా ఇంటర్వ్యూలు ఇచ్చుకుంటున్నారు. సరే హైడ్రా సంస్థ గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇంటర్వ్యూలు ఇస్తే ఫర్వాలేదు. కానీ ఇంటర్వ్యూల్లో నన్ను ఉద్దేశించి మాట్లాడడమే కరెక్టు కాదని అన్నారు. రంగనాథ్ పోలీసు అధికారి అనుకుంటున్నారా ... పొలిటీషియన్ అనుకుంటున్నారా ... ఆయన నన్ను విమర్శించాలనుకుంటే కాకీ డ్రెస్ విప్పేసి ఖద్దరు బట్టలు వేసుకోవచ్చు. కానీ కాకీ డ్రెసులో ఉండి నా లాంటి సీనియర్ పొలిటీషియన్ను కామెంట్ చేయడం సరికాదు. ఇది పోలీస్ సర్వీసు కండక్ట్ రూల్స్ విరుద్ధమనే అనుకుంటున్నారు. గతంలో సిఎం కేసిఆర్ కూడా ఇలాగే సిద్ధిపేట కలెక్టర్ వెంకట్రామా రెడ్డికి మల్లన్నసాగర్ ప్రాజెక్టు విషయంలో రైతుల నుంచి భూసేకరణ చేయిస్తే ఎమ్మెల్సీ ఇస్తానని ఆఫర్ ఇచ్చారు. ఆ మేరకు ఆయనను కేసిఆర్ ఎమ్మెల్సీని చేసాను. ఇపుడు సిఎం రేవంత్ రెడ్డి కూడా కేసిఆర్ బాటలోనే నడుస్తున్నారు. రంగనాథ్ కు ఎమ్మెల్సీనో, ఎంపీనో ఆఫర్ ఇచ్చారు. అందుకోసమే రంగనాథ్ ఇపుడు సిఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టుగా వ్యవహరిస్తున్నారుహైడ్రా కమిషనరుగా రంగనాథ్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఏ రాజకీయ పార్టీల నాయకులకు సంబంధించిన అక్రమ కట్టడాలున్నా వాటిపై చర్యలు తీసుకోవాలి. నేను మజ్లిస్ పార్టీ నేతలకు సంబంధించి సల్కం చెరువులోని అక్రమ నిర్మాణాన్ని ఎప్పుడు కూల్చివేస్తారని ప్రశ్నించాను. అలాగే పాతబస్తీలోని బార్కాస్లో గుర్రం చెరువు, పాతబస్తీ శివారులోని జల్పల్లి పెద్ద చెరువు, రాజేంద్ర నగర్ సర్కిల్ శివరాంపల్లిలోని ఊరచెరువు శిఖం, బఫర్ జోన్ ప్రాంతాలు పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. మరి పాతబస్తీలోని చెరువుల పరిరక్షణ హైడ్రాకు, కాంగ్రెస్ సర్కారుకు పట్టదా ... అని ప్రశ్నించాను. కమిషనరుగా చాతనైతే వాటిపై స్పందించకుండా రాజకీయ కామెంట్లు చేయడమేంటని అన్నారు. సల్కం చెరువులోని ఓవైసీ భవనాల్లో విద్యా సంస్థలున్నాయని, అకడమిక్ ఇయర్ పూర్తయ్యాక వాటిని కూల్చేస్తామంటున్నారు కదా, ఇదే ఫార్ములా ఇతర విద్యాసంస్థలకు ఎందుకు వర్తించదు. అంటే హైడ్రా హిందువులపై ప్రయోగించడానికేనా .ముస్లింలపై ప్రయోగించడానికి కాదా .... కాంగ్రెస్ సర్కారు, సిఎం రేవంత్ రెడ్డి .. హైడ్రాను కేవలం హిందువుల నిర్మాణాలనే కూల్చమని చెప్పారా ... ముస్లింల అక్రమ నిర్మాణాలను వదిలేయమని చెప్పారా ... దీనిపై దమ్ముంటే సిఎం రేవంత్ రెడ్డినే స్పందించాలి.

## ఎన్సీపీ సహచరుల పక్కన కూర్చున్న తర్వాత వాంతులవుతాయి: శివసేన మంత్రి



ముంబై: మహారాష్ట్రలోని అధికార మహాయుతి సంకీర్ణ ప్రభుత్వంలో లుకలుకలు బయటపడుతున్నాయి. సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన శివసేన మంత్రి తానాజీ సావంత్ (౧వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేబినెట్ సమావేశాల్లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) సహచరుల పక్కన కూర్చున్న తర్వాత తనకు వాంతులు అవుతున్నాయని అన్నారు. గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో శివసేన మంత్రి తానాజీ సావంత్ మాట్లాడారు. తాను హార్డ్‌కోర్ శివ సైనికుడినని ఆయన తెలిపారు. డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ నేతలతో తనకు ఎప్పుడూ సఖ్యత లేదని చెప్పారు. 'మేం (అజిత్ పవార్, నేను) క్యాబినెట్‌లో పక్కపక్కనే కూర్చున్నప్పటికీ బయటకు వచ్చిన తర్వాత నాకు వాంతులు అవుతున్నట్లు అనిపిస్తుంది' అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.కాగా, శివసేన మంత్రి తానాజీ సావంత్ వ్యాఖ్యలు అధికార మహాయుతి సంకీర్ణ ప్రభుత్వంలో కలకలం రేపాయి. ఎన్సీపీ అధికార ప్రతినిధి, శాసన మండలి సభ్యుడు అమోల్ మిత్కారీ ఆయన వ్యాఖ్యలను ఖండించారు. బలహీనమైన సంకీర్ణాన్ని కొనసాగించడం తమ పార్టీ బాధ్యత మాత్రమేనా? అని ప్రశ్నించారు. సంకీర్ణ ధర్మాన్ని కాపాడుకోవడం కోసమే తాము మౌనంగా ఉన్నామని అన్నారు.

## కొండచరియలు విరిగిపడి.. ఒకే కుటుంబానికి చెందిన 12 మంది మృతి

న్యూఢిల్లీ: పొరుగు దేశం పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. కొండచరియలు విరిగిపడి ఒకే కుటుంబానికి చెందిన 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో తొమ్మిది మంది చిన్నారులు కూడా ఉన్నట్లు పాకిస్థాన్ మీడియా నివేదించింది.శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోని అప్పర్ దిర్ జిల్లాలో గల మైదాన్ ప్రాంతంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. అవి నేరుగా ఓ ఇంటిపై పడటంతో ఒకే కుటుంబానికి చెందిన 12 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో తొమ్మిది మంది చిన్నారులు కాగా, ఇద్దరు మహిళలు ఉన్నట్లు సదరు అధికారిని ఊటంకిస్తూ డాన్ వార్తాపత్రిక పేర్కొంది. సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపింది. శిథిలాల కింద నుంచి మొత్తం 12 మంది మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొంది.కాగా, గత కొన్ని రోజులుగా పాకిస్థాన్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వచ్చే 24 గంటల్లో దేశవ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పాకిస్థాన్ వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ భారీ వర్షాలకు ముర్రే, గల్లియత్, మన్సెహ్రా, కోహిస్తాన్, చిత్రాల్, దిర్, స్వాత్, షాంగ్లా, బునేర్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని హెచ్చరించింది.



## హైడ్రాకు స్పెషల్ పవర్స్..

హైదరాబాద్, ఆగస్టు 30, (న్యూస్ పల్స్) అభివృద్ధి జరగాలంటే కేవలం మనిషులే బాగుపడితే సరిపోదు. చుట్టూ ఉన్న ప్రకృతిని కాపాడుకుంటూ వెళ్లాలి. దాన్ని పట్టించుకోకపోతే ప్రకృతి రిటర్న్ గిఫ్ట్ ఏదో ఒక రూపంలో కచ్చితంగా ఇచ్చి తీరుతుంది. ఇటీవలి కాలంలో రెగ్యులర్ గా చూస్తున్న కరువు, వరదలు, భూతాపమే ఇందుకు ఉదాహరణ. సహజ వనరులు బాగుండాలి. అప్పుడే అందరం బాగుంటాం అన్నది గతంలో ఏ ప్రభుత్వాలూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు ప్రకృతి వనరులను కాపాడడానికి ఏకంగా హైడ్రా అన్న వ్యవస్థ సీఎం రేవంత్ ఆలోచనల నుంచి తొలిసారిగా వచ్చింది. జనం స్పందన కూడా అంతకు మించి వస్తోంది. కంప్లైంట్స్ రోజురోజుకూ పెరుగుతుండడంతో హైడ్రా పోలీస్ స్టేషన్, త్వరలోనే చట్టం కూడా తెచ్చే ఛాన్స్ కనిపిస్తోంది.అవును హైడ్రాకు హైపవర్స్ రాబోతున్నాయి. పెద్ద లక్ష్యంతో మొదలైన ఈ వ్యవస్థకు ఇప్పుడు బలం విపరీతంగా పెరిగింది. జనం నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. బడాబాబులు షేక్ అయ్యేలా సీన్ మారింది. ఎవరు అడ్డొచ్చినా వినే పరిస్థితిలో హైడ్రా బుల్డోజర్ లేదు. నోటీసులు ఇవ్వడం పాత పద్ధతి, అక్రమమని తేలితే చాలు కూల్చడమే హైడ్రా పని. అవును ఇలాంటి వ్యవస్థ ఇదే తొలిసారి. పార్టీలకు అతీతంగా పవర్ చూపిస్తోంది. సాధారణంగా అధికారంలో ఉన్న వారైతే ఒకలా ట్రీట్ మెంట్, ప్రత్యర్థి పార్టీలైతే మరోలా ట్రీట్ మెంట్ ఉంటుంది. దీంతో ఒకర్ని వదిలేసి ఇంకొకరిపై చర్యలు తీసుకుంటే అసలు లక్ష్యమే నీరుగారిపోతుంది. గతంలో ఇలా పర్యావరణ పరిక్షణ కోసం, జల వనరుల సంరక్షణ కోసం వ్యవస్థలు ఏర్పాటైనా ఆశించిన లక్ష్యం నెరవేరలేదు. సో ఇప్పుడు కథ మార్చాలని డిసైడ్ అయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. అన్నిటి మాదిరిగానే హైడ్రాను పెడితే ఎలాంటి ఉపయోగం లేదని ముందుగానే డిసైడ్ అయ్యారు. అందుకే కాస్త కఠినంగా ఉండైనా సరే అనుకున్న లక్ష్యం దిశగా హైడ్రాను నడిపిస్తున్నారు. మిత్రులైనా, ప్రత్యర్థి పార్టీల నేతలైనా ఒకటే ట్రీట్ మెంట్ ఉంటోంది.కాబట్టి ఇప్పుడు హైడ్రాకు పని చాలా పెరిగింది. మొదట్లో ఒకట్రెండు ఫిర్యాదుల నుంచి ఆ తర్వాత పదుల సంఖ్యలోకి పెరిగాయి. సీన్ కట్ చేస్తే ఇప్పుడు వందలాది కంప్లైంట్స్ వస్తున్నాయి. వాటిలో ప్రాధాన్యతా క్రమంలో హైడ్రా డీల్ చేస్తోంది. చెరువును చెరపట్టిన వారి భరతం పడుతోంది. హైడ్రా బుల్డోజర్ సిటీలో ఏ మూలకైనా వెళ్లేలా ఈ సంస్థకు ఇకపై సరికొత్త పవర్స్ రాబోతున్నాయి. అనుకుంటే ఏదైనా చేసేలా అధికారాలు రాబోతున్నాయి. ఇప్పటిదాకా ఎఫ్టీఎల్ పరిధిలోని నిర్మాణాలను కూలుస్తూ ఆక్రమణదారులకు దడ పుట్టిస్తున్న హైడ్రా.. ఇలాంటి వాటికి పర్మిషన్లు ఇచ్చిన అధికారులైనా నజర్ పెట్టింది. అంతర్గతంగా విజిలెన్స్ విచారణ కూడా కొనసాగుతోంది. సో కథ చాలా దూరం వెళ్లేలా కనిపిస్తోంది.ప్రస్తుతం బుద్ధభవన్‌లోని ఆఫీసులో హైడ్రా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. చెరువుల ఆక్రమణలపై పెద్దసంఖ్యలో వస్తున్న ఫిర్యాదులను పరిశీలించేందుకు ఇప్పటికే ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన హైడ్రా, ఆ పోలీస్ స్టేషన్‌ను బుద్ధభవన్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే డిప్యుటేషన్‌పై 259 మంది పోలీసు సిబ్బందిని కోరగా, ఆ సంఖ్య మరింతగా పెరుగుతుందంటున్నారు. మరోవైపు ఇప్పటివరకు కూల్చివేతలకు సంబంధించి ఆక్రమణదారులపై ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో హైడ్రా కేసులు నమోదు చేసేందుకు రెడీ అయింది. అలాగే అక్రమ నిర్మాణాలకు సంబంధించి అనుమతులు ఇచ్చిన అధికారులపైనా అంతర్గతంగా విజిలెన్స్ విచారణ కొనసాగిస్తోంది. హైడ్రా ఆఫీసుకు అన్ని పార్టీల నుంచి తాకిడి రోజురోజుకు పెరుగుతోంది.మొదట పదుల సంఖ్యలో వచ్చిన కంప్లైంట్స్ కాస్తా హైడ్రా కఠిన చర్యలతో వందల్లోకి పెరుగుతున్నాయి. వాటన్నింటిని స్వీకరిస్తున్న సిబ్బంది, ఆ వివరాలను నమోదు చేసుకుంటూ కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్తున్నారు. అందులో వేగంగా చర్యలు తీసుకోవాల్సిన వాటిపై రంగనాథ్ ఫోకస్ పెడుతున్నారు. అన్ని కోణాల్లో పరిశీలించాకే రంగంలోకి దిగుతున్నారు. మరోవైపు కంప్లైంట్స్ ఇచ్చే వారి సంఖ్య పెరగడంతో హైడ్రా ఆఫీస్ దగ్గర పోలీసుల బందోబస్తు పెంచారు. సో జనం నుంచి ఊహించనంతగా రెస్పాన్స్ వస్తుండడంతో హైడ్రా బుల్డోజర్ స్పీడ్ పెంచేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే హైడ్రా చట్టం కూడా తెచ్చేలా రెడీ అవుతోంది ప్రభుత్వం. హైడ్రా పోలీస్ స్టేషన్స్ ఏర్పాటు చేశాక.. ప్రజలు నేరుగా అక్కడికే వెళ్లి అక్రమ నిర్మాణాలపై కంప్లైంట్స్ ఇచ్చేలా ఏర్పాటు చేయబోతున్నారు.నిజానికి చెరువుల ఎఫ్టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదు. కానీ జరిగిపోయాయి. ఎందుకంటే అక్రమంగా పర్మిషన్లు ఇవ్వడం, తప్పుడు సర్వే నెంబర్లు చూపి పర్మిషన్ల కోసం అప్లై చేసుకున్న వారి వ్యవహారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం ఇవన్నీ జరిగాయి. ఇంకొందరు పైసల కక్కుర్తితో రాజీ పడి పర్మిషన్లు ఇచ్చేశారు. అయితే ఇన్ని రోజులుగా అక్రమ నిర్మాణాలను బుల్డోజర్ తో నేలమట్టం చేస్తున్న హైడ్రా.. ఇకపై అక్రమ పర్మిషన్లు ఇచ్చిన ఆఫీసర్లపైనా లెన్స్ పెట్టింది. అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై హైడ్రా పోలీస్ స్టేషన్ చర్యలు తీసుకుంటుందంటున్నారు రంగనాథ్. ఇప్పటివరకు జరిగిన విచారణలో కొంతమంది అవినీతి అధికారులను హైడ్రా గుర్తించింది కూడా. అవినీతి అధికారులపై త్వరలోనే కేసు నమోదు చేసి విచారణ చేస్తామనీ అంటున్నారు. సో పర్మిషన్లు ఇచ్చేశాం.. మాకేం సంబంధం లేదు అనే వారికి చుక్కలు చూపించబోతున్నారు.

## తెలంగాణలో రేడియల్ రోడ్స్

హైదరాబాద్, ఆగస్టు 30 (న్యూస్ పల్స్) ఔటర్, రీజినల్ రింగ్ రోడ్లను లింక్ చేసేందుకు 50 రేడియల్ రోడ్లను నిర్మించాలని ఇటీవల ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ మేరకు రోడ్లు, భవనాలు శాఖ, పురపాలక, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా ఈ రోడ్లను నిర్మించాలని ఆదేశించింది. ఈ రోడ్ల డీపీఆర్ కూడా నోడల్ ఏజెన్సీగా హెచ్‌ఎండీఏకు అప్పగించినట్లు తెలిసింది. ఈ రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.2,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలకు రేడియల్ రోడ్లు సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవ్‌పూర్, భువనగిరి, చౌటుప్పల్, ఆమనగల్లు, యాచారం, కందుకూరు, షాద్‌నగర్, చేవెళ్ల, కంది ప్రాంతాలకు అనుసంధానంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారుఓఆర్ఆర్,

ఆర్ఆర్ఆర్ లింక్ కోసం నిర్మించనున్న రేడియల్ రోడ్ల కోసం సాధ్యమైనంత వరకు అన్నదాతల భూములను సేకరించవద్దని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించినట్లు తెలిసింది. ప్రభుత్వ, అటవీ భూములకే ప్రయారిటీ ఇవ్వాలని, అలాంటివి అందుబాటులో లేనిచోట రైతుల నుంచి భూమి సేకరించాలని చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర, హైదరాబాద్ అభివృద్ధి పేరుతో అన్నదాతల ఆస్తులను పణంగా పెట్టొద్దని చెప్పినట్లు తెలిసింది. ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు ఇదే విషయమై స్పష్టమైన ఆదేశాలు చేసినట్లు సమాచారం. ఆ మేరకే అధికారులు సైతం అలైన్‌మెంట్ రూపకల్పనపై దృష్టి సారించినట్లు తెలిసింది. సీఎం సూచన మేరకు దాదాపు నాలుగు అలైన్మెంట్ డిజైన్లు రూపొందించేందుకు కసరత్తు ప్రారంభించినట్లుగా టాక్ వినిపిస్తోంది. దీంతో హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ అటవీ, ప్రభుత్వ భూములున్నాయో ఆర్ అండ్ బీ అధికారులు అధ్యయనం చేస్తున్నారు.

## చర్చలు జరిపే కాలం ముగిసింది.. పాక్ చర్యకు తప్పకుండా ప్రతిచర్య ఉంటుంది : జైశంకర్



న్యూఢిల్లీ: దాయాది దేశం పాకిస్థాన్ విషయంలో భారత్ వైఖరిపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశంతో చర్చలు జరిపే కాలం ముగిసిందన్నారు. ఇకమీదట సానుకూలమైనా ప్రతికూలమైనా పాక్ నుంచి వచ్చే చర్యకు తప్పకుండా ప్రతిచర్య ఉంటుందని స్పష్టంచేశారు.శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్.. పాకిస్థాన్ అంశాన్ని ప్రస్తావించారు. పాకిస్థాన్ మనతో ఎలా వ్యవహరిస్తే.. మనమూ అందుకు తగిన విధంగా బదులిస్తామని స్పష్టం చేశారు. 'పాకిస్థాన్‌తో పదే పదే చర్చలు జరిపే కాలం ముగిసింది. మన దేశం పట్ల పాకిస్థాన్ ఎలా వ్యవహరిస్తే.. మనం కూడా అందుకు తగిన విధంగా బదులిస్తాం. పాక్ నుంచి వచ్చే చర్య సానుకూలమైనా ప్రతికూలమైనా తప్పకుండా ప్రతిచర్య ఉంటుంది. పరిస్థితులకు అనుగుణంగా భారత్ ముందడుగు వేస్తుంది' అని జై శంకర్ స్పష్టం చేశారు.ఇక ఇదే కార్యక్రమంలో ఉగ్రవాద కార్యకలాపాలపై కూడా జైశంకర్ స్పందించారు. పాకిస్థాన్ చేపడుతున్న ఉగ్రవాద చర్యలకు తగిన పరిణామాలు ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు. ఇటీవలే జమ్మూ లోయలో వరుసగా జరుగుతున్న ఉగ్రదాడులతో రెండు దేశాల మధ్య సత్సంబంధాలు అస్థిరంగా మారాయన్నారు. ప్రధాని మోదీ ఈ విషయంలో వెనక్కి తగ్గరని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు ఓ ముగిసిన కథ అని జైశంకర్ పేర్కొన్నారు.ఇక పొరుగు దేశం బంగ్లాలోని పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు జై శంకర్ వెల్లడించారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమయానుగుణంగా వ్యవహరిస్తామని తెలిపారు. పొరుగుదేశాలతో సమస్యలు ఉండని దేశమంటూ ఏదీ లేదని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. దేశాల మధ్య పరస్పర సహాయ, సహకారాలు అందించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కొత్తగా ఏర్పాటైన బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం కూడా భారత్‌తో సత్సంబంధాలు కలిగి ఉంటుందని జై శంకర్ ఆశాభావం


## శ్రీ బసవేశ్వర ఆలయంలో అన్న సంతర్పణ






కామారెడ్డి జిల్లా రాజంపేట ఆగస్టు 30 లోకంతీరుజిల్లాలోని రాజంపేట మండలం బస్వన్న పల్లి గ్రామంలోని శ్రీ బసవేశ్వర స్వామికి పూజలు నిర్వహించి, అన్న సంతర్పణ ప్రతి సంవత్సరం మూడవ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమము పూర్వీకుల నుండి ఆనవాయితీగా ప్రతి సంవత్సరము శ్రావణమాసం మూడో శుక్రవారం ఈ కార్యక్రమం చేయడం జరుగుతుందని గ్రామ పెద్దలు అన్నారు. ఈ కార్యక్రమం రెడ్డి సంఘం సభ్యులు లింగయ్య, సభ్యులు గ్రామ పెద్దలు కలిసి నిర్వహించారు.

## బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం





రామారెడ్డి ఆగస్టు 30 (లోకం తీరు)రామారెడ్డి మండల కేంద్రంలో శుక్రవారం భారతీయ జనత పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మండల అధ్యక్షులు కట్ట ఈశ్వర్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సంకటి విట్టల్, జిల్లా ఈసీ నెంబర్ భూమా గౌడ్,జిల్లా కిసాన్ మోర్చా ఈసి మెంబర్ గోపి,రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యుడు వెంకన్న, మండల కిషన్ మోర్చా అధ్యక్షులు గాండ్ల సాయిలు,రామారెడ్డి మండల ఉపాధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు అంజయ్య, బూత్ అధ్యక్షులు జీర్ణ మహేష్,బైండ్ల వేణు, బాలయ్య, సాయికుమార్, నరహరి , సుధాకర్ రెడ్డి ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి తో ఉద్యోగ శిక్షణ ఉన్నత విద్య..- ఇంటర్ విద్య అధికారి



నిజామాబాద్,ఆగస్టు 30(లోకంతీరు):ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించేందుకుగాను ఉపాధితో పాటు ఉద్యోగ శిక్షణ, ఉన్నత విద్యను అందిస్తున్న హెచ్.సి.ఎల్. టెక్ బి సంస్థ కృషి అభినందనీయం అని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ అన్నారు. శుక్రవారంనాడు నిజామాబాద్ ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల ఆవరణలో హెచ్ సి ఎల్ టెక్ బి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీ రవి కుమార్ మాట్లాడుతూ గ జాబ్ మేళా ద్వారా సాఫ్ట్ వేర్ రంగంలో శిక్షణ పొందుతూ ఉన్నత విద్యను కూడా అభ్యసించడం ద్వారా భవిష్యత్ ను తీర్చిదిద్దుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాదు మరియు చుట్టుప్రక్కల ప్రాంతాల ఇంటర్మీడియట్ బైపిసి, సిఇసి, హెచ్చిసి, ఒకేషనల్ లో వివిధ గ్రూప్ లలో పూర్తి ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులు సుమారుగా 60కు పైగా పాల్గొన్నారు. హెచ్.సి.ఎల్.టెక్ బి ఏరియా ప్రతినిధి ఆర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఈ మేల ద్వారా ఎంపికైన విద్యార్థులకు శిక్షణ తో పాటు ఉన్నత విద్య అందిస్తామన్నారు. ఈ విద్యార్థిని విద్యార్థులకు సాఫ్ట్వేర్ రంగంలో ఆఖూ రోల్ లో ఒక సంవత్సరం శిక్షణ ఇచ్చి ఉద్యోగంలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ గిరిరాజ్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామ్ మోహన్ రెడ్డి, టి.ఎస్.కె.సి. కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. రామకృష్ణ , మెంటర్ శ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశాఖ అధికారి నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

**చూపు పోయిన విద్యార్థి కి న్యాయం చేయాలి**
**భారతీయ విద్యార్థి మోర్చ రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్ డిమాడ్**

కామారెడ్డి జిల్లా తాడ్వాయి ఆగస్టు 30 లోకంతీరుజిల్లాలోని తాడ్వాయి మండలం నందివాడ ప్రభుత్వ పాఠశాలలో కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కార్యక్రమంలో జరిగిన సంఘటనలో విద్యార్థి యొక్క కన్ను చూపు పోయింది. ఈ సంఘటనపై జిల్లా విద్యా శాఖ అధికారి చర్యలు తీసుకోవాలని భారతీయ విద్యార్థి మోర్చ(బి వి ఎం) డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నందివాడ ఉన్నత పాఠశాల 6 తరగతి చదువుతున్న శరత్ అనే విద్యార్థికి గత వారం కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టబోయి కట్టే వచ్చి అతని కంటిలోకి వెళ్లి ప్రమాదం జరిగింది. దీంతో అతని కంటి చూపు పోవడం అతనిని ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ కు తరలించారు. భారతీయ విద్యార్థి మోర్చా సదరు పాఠశాలను సందర్శించి వివరాలను సేకరించారు. ఉన్నత అధికారుల నిర్లక్ష్యం ఉందని స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిసి కూడా చర్యలు తీసుకోకుండా వారికే వత్తాసు పలుకుతూ ఉన్నారు. ఆ పాఠశాలలో సమయపాలన పాటించకుండా ఉపాధ్యాయులు



సరైన సమయానికి పాఠశాలకు రాకపోవడం జిల్లా విద్యాశాఖ అధికారి రాజు వత్తజు చేయడం సిగ్గుచేటన్నారు. ఘటనకు కారకులపై చర్యలు తీసుకోవాలని భారతీయ విద్యార్థి మోర్చ డిమాండ్ చేసారు. జిల్లా విద్యాశాఖ అధికారి విషయాన్ని కప్పిపుచ్చాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరుతున్నాము.

# మండల కేంద్రంలో ముగ్గురికి డెంగ్యూ పాజిటివ్ నమోదు-- వైద్య బృందం పర్యవేక్షణ








రామారెడ్డి, ఆగస్టు 30 (లోకం తీరు)మండల కేంద్రంలో శుక్రవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ ఆయా గ్రామాలలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగాఇసన్న పల్లి గ్రామం, రామారెడ్డి లో గల పలు వార్డులలో శానిటేషన్ ని పరిశీలించడం జరిగింది. రిపోర్ట్ లో మూడు డెంగీ పాజిటివ్ రావడం జరిగింది. అవి అన్ని కూడా రామరెడ్డి కి చెందినవి. ప్రజలందరూ కూడా తమ తమ ఇంటి పరిసరాలను శుభ్రపరచుకోవాలి అని సూచనలు ఇవ్వడం జరిగింది. దోమలు ఎక్కువగా ఉండటం వలన ప్రజలు దోమ తెరలు వాడటం, దోమ లు పెరిగే నీటి గుంతలు లేకుండా చేసుకోవాలి అని డ్రైడే ఆక్టివిటీలో భాగంగా డాక్టర్ సురేష్, రామారెడ్డి మెడికల్ ఆఫీసర్ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వర్, ఇంచార్జ్ ఎంపీడీవో తిరుపతి, పంచాయతీ సెక్రెటరీ క్రాంతి కుమార్ , ఆరోగ్య కేంద్ర వైద్య బృందం పాల్గొన్నారు.

## ఇంటర్ లో డిలీట్ ఆప్షన్ - జిల్లా ఇంటర్ విద్య అధికారి



నిజామాబాద్ ఆగస్టు 30(లోకంతీరు): నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర అన్ని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ లో చేరి ఇతర కళాశాలలో చేరేందుకు గాను డిలీట్ ఆప్షన్ ఆగస్టు 31వ తేదీ ఒకరోజు మాత్రమే ఆన్లైన్లో అందుబాటులో ఉంటుందని జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ తిరుమలపూడి రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ఇంటర్ విద్య కమిషనర్ ఆదేశాల మేరకు ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు లేదా ప్రిన్సిపాల్ లు తమ కళాశాలల్లో చేరిన విద్యార్థులు ఇతర కళాశాలలో చేరడానికి విద్యార్థుల కోరిక మేరకు అడ్మిషన్ డిలీట్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తమ ఇష్టమైన కళాశాలలో లేదా ఇతర గ్రూపులోకి చేరడానికి అవకాశం కల్పించాలని ఆదేశించారు. ప్రైవేట్ యాజమాన్యాలు, ప్రిన్సిపాల్ లు విద్యార్థుల డిలీట్ ఆప్షన్ చేయకుండా వారి వద్ద ఫీజులు వసూలు చేయడం గానీ, ఇతర ఎలాంటి ఇబ్బందులకు గురిచేసిన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్య అధికారి హెచ్చరించారు. అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం లో అడ్మిషన్ పొందడానికి సెప్టెంబర్ ఏడవ తేదీ వరకు ఇంటర్ బోర్డు పొడిగించిందని ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో చేరాడ్నికి పేద, బడుగు, బలహీనర్గాలకు చెందిన, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు అందరు సెప్టెంబర్ 7వ తేదీ వరకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రామ్నగర్లో హైడ్రా కూల్చివేతలు

### నాలా ఆక్రమణలను కూల్చేసిన అధికారులు

హైదరాబాద్,ఆగస్ట్30(ఆర్ఎన్ఎ): హైదరాబాద్లోని అడిక్మెట్ డివిజన్ రాంనగర్లో 'హైడ్రా' కూల్చివేతలు చేపట్టింది. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ కాలనీలో నాలాను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దీనిపై నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీ రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. నిర్మాణాలు అక్రమమే అని నిర్ధరించిన అనంతరం హైడ్రా అధికారులు శుక్రవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. ఇక్కడ విక్రమ్యాదవ్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో అక్రమంగా కల్లు కాంపౌండ్ కొనసాగుతోందని స్థానికులు రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారని అందులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన యంత్రాంగం అక్కడి కల్లును పారబోసి పూర్తిగా సామగ్రిని తొలగించి.. కూల్చివేతలు చేపట్టింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే హైడ్రా చర్యలకు ఉపక్రమించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# డంపింగ్ యార్డును సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్, ఆగస్టు 30 (లోకంతీరు): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారం శివారులో గల చెత్త డంపింగ్ యార్డును కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. యంత్రాల పనితీరును కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేశారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను తెలుసుకున్నారు. చెత్తను శుద్ధి చేసే ప్రక్రియలో పాల్గొంటున్న కార్మికుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి అవసరమైన సేఫ్టీ కిట్లు అందించి వాటిని తప్పనిసరిగా వినియోగించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెత్తను సేకరించే సమయంలోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా తరలించాలని, ఈ మేరకు ప్రజలలోనూ అవగాహన పెంపొందింపజేయాలని సూచించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, శానిటేషన్ విభాగం



అధికారులు ఉన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీజిల్లా కేంద్రంలోని సీతారాంనగర్ కాలనీలో గల అర్బన్ హెల్త్ సెంటర్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. ఆసుపత్రిలోని రిజిస్ట్రేషన్ కౌంటర్, అవుట్ పేషంట్, ఇన్-పేషంట్ విభాగాలు, వివిధ వార్డులను సందర్శించారు. మధుమేహం నిర్ధారణ, రక్తపరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించి పలు వివరాలు అడిగి



తెలుసుకున్నారు. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు సంబంధించిన రాపిడ్ కిట్స్ ను పరిశీలించి, అన్ని సబ్ సెంటర్లు, పీహెచ్సీలలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి రోజు సగటున ఎంతమంది రోగులు వస్తారు, ఎంతమంది ఇన్ పేషంట్లుగా చేరుతున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని వైద్యులను ఆరా తీశారు. రోగులను పలుకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ తుకారం రాథోడ్, డాక్టర్ అంజన తదితరులు ఉన్నారు.

# అలీసాగర్ ఆయుకట్టుకు ఎత్తిపోతల పథకం

**జలాలు కోస్లీ పంప్ హౌస్ వద్ద నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్**

నిజామాబాద్, ఆగస్టు 30(లోకంతీరు) : అలీసాగర్ ఆయకట్టు పరిధిలో పంటలకు సాగు జలాలు అందించేందుకు వీలుగా శుక్రవారం ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి నవీపేట మండలం కోస్లీ వద్ద గల పంప్ హౌస్ లో మోటార్లకు పూజలు నిర్వహించి స్విచాన్ చేసి నీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. గోదావరిలో ఇంటెక్ వెల్ వద్ద నీటి నిల్వలను, పంప్ హౌస్ లోని మోటార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆయకట్టు రైతుల కోరిక మేరకు అలీసాగర్ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. అయితే, గోదావరిలో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నందున, రైతులు పొదుపుగా నీటిని వినియోగించుకోవాలని సూచించారు. పంటలకు అవసరం ఉన్నంత వరకే నీటిని వాడుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని వృధా చేయకూడదని హితవు పలికారు. రైతాంగ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. పంప్ హౌస్ ప్రాంగణంలో రైతులతో ఎమ్మెల్యే భేటీ అయిన సందర్భంగా పలువురు పంట రుణాల మాఫీ అంశాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ విషయమై ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందిస్తూ, అర్హులైన ప్రతి రైతుకు రూ. రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయడం



జరుగుతుందని స్పష్టం చేశారు. వివిధ కారణాల వల్ల రుణమాఫీ జరగని రైతుల నుండి అధికారులు అర్జీలు స్వీకరించడం జరుగుతోందని, రుణమాఫీ కానీ రైతులు అధికారులను సంప్రదించాలని సూచించారు. తప్పనిసరిగా అర్జీలను పరిశీలించి ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి అర్హులందరికీ పంట రుణాలు మాఫీ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కాగా, పలు సహకార సంఘాలలో పంట రుణాల మాఫీలో అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత అధికారులతో విచారణ జరిపిస్తామన్నారు. అక్రమాలు వాస్తవమని తేలితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని



హెచ్చరించారు. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ఫార్మర్లు ధ్వంసం చేసే వాటిలోని కాపర్ కాయిల్స్ చోరీ చేస్తున్నారని, దీనివల్ల పంపుసెట్లు పనిచేయక రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నందున ట్రాన్స్ఫార్మర్స్ చోరీలను నిలువరించేందుకు గట్టి నిఘా ఉంచాలని ట్రాన్స్కో, పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నీటి పారుదల శాఖ ఎస్.ఈ గంగాధర్, ఏ.ఈ ప్రణయ్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్, ఆయా శాఖల అధికారులు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు

# సినిమా తీరు

## మత్తు వదలరా 2 టీజర్.. మరోసారి తస్కరించుట



2019లో విడుదలైన 'మత్తు వదలరా' సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన ఈ చిత్రం ఊహించని విధంగా ఆడియన్స్ నుండి అద్భుతమైన స్పందన అందుకుంది. ఈ చిత్రంలో ట్విస్ట్‌లు, సస్పెన్స్-థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఎట్రాక్ట్ చేయగా, కీరవాణి కొడుకు శ్రీసింహా ఆ సినిమాతో హీరోగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్నాడు.రితేష్ రానా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీసింహాతో పాటు సత్య చేసిన కామేడి రోల్ బాగా వర్కౌట్ అయ్యింది. ఇక ఈ చిత్రానికి సీక్వెల్ రాబోతోందన్న వార్తలు కొన్ని నెలల కిందటే బయటకు వచ్చాయి. ఫైనల్ గా సెప్టెంబర్ 13న థియేటర్లలో విడుదల కానున్నట్లు సోమవారం ప్రకటించడం జరిగింది. ఈ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఇప్పుడు స్పెషల్ టీజర్ ను కూడా రిలీజ్ చేశారు.టీజర్ విషయానికి వస్తే.. సోషల్ మీడియాలో ట్రెండ్ అయిన విషయాలను కాంట్రవర్సీలను గట్టిగానే టచ్ చేశారు అనిపిస్తోంది. వెన్నెల కిషోర్ సీరియస్ కామెడీ ప్రెస్ మీట్ తో మొదలైన సీన్స్ చాలా ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఊ.ఇ టీమ్ అంటూ హీరోతో పాటు సత్య స్పెషల్ ఆఫీసర్లుగా కనిపిస్తున్నారు. మోస్ట్ ఎమెర్జెన్సీ సిచువేషన్స్ ను డీల్ చేసే ఈ ఇద్దరు మళ్ళీ డబ్బుల కోసం ఏ విధంగా అడుగులు వేశరనే పాయింట్ హైలెట్ అవుతోంది. ఇక వీరికి పై ఆఫీసర్ పాత్రలో రోహిణి కనిపిస్తున్నారు.డెలివరీ భాయ్ గా చేశాను, స్పెషల్ ఏజెంట్ గా చేసినా జీతం సరిపోవడం లేదని హీరో క్యారెక్టర్ ను మళ్ళీ అదే స్టైల్ లో హైలెట్ చేశారు. ఇక హీరోయిన్ ఫారియా కూడా ఏదో యాక్షన్ రోల్ లో కనిపిస్తున్నట్లు అర్థమవుతుంది. దొంగతనం చేయడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించగా.. సత్య తస్కరించుట డైలాగ్ కూడా హైలెట్ అయ్యింది.డ్రగ్స్ కావాలా నీకు.. పెద్ద పెద్ద హేమాహేమిాలే దొరికిపోయారురా.. అంటూ సత్య చెప్పిన డైలాగ్ కూడా హాట్ టాపిక్ గా నిలిచేలా ఉంది. బాలయ్య వైరల్ వీడియో డైలాగ్ ను కూడా వదల్లేదు. నవ్వోద్దు.. ఇట్స్ ఏ సీరియస్ మ్యాటర్ అంటూ వెన్నెల కిషోర్ కూడా వైరల్ అయ్యేలా ఓ డైలాగ్ వదిలాడు. చూస్తుంటే నేటితరంకు కనెక్ట్ అయ్యేలా సీన్స్ ను గట్టిగానే డిజైన్ చేసినట్లు అనిపిస్తుంది. దానికి తోడు ఛేజింగ్ సీక్వెన్స్, యాక్షన్ ఎలిమెంట్స్ కూడా ఎట్రాక్ట్ చేస్తున్నాయి.అలాగే సునీల్ కూడా సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రతీ పాత్ర కూడా వేరే లెవెల్‌లో డిజైన్ చేసినట్లు అనిపిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాల భైరవ ఈ సినిమాకి సంగీతం అందిస్తుండగా, సురేష్ సారంగం సినిమాటోగ్రాఫర్‌గా, కార్తీక శ్రీనివాస్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. మొత్తానికి, మత్తు వదలరా 2 టీజర్ అయితే బాగానే ఉంది. మరి ఈ సీక్వెల్ ప్రేక్షకుల అంచనాలను అందుకొని, బాక్సాఫీస్ వద్ద మరోసారి విజయాన్ని సాధిస్తుందో లేదో చూడాలి.

## దేవరకొండ.. ఎంత జాగ్రత్తగా ఉన్నాడంటే..


సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళుతున్న విజయ్ దేవరకొండ ఇప్పుడు మరికొన్ని డిఫరెంట్ సినిమాలతో రెడీ అవుతున్న విషయం తెలిసిందే. రాబోయే సినిమాలతో ఎలాగైనా బాక్స్ ఆఫీస్ వద్ద సాలిడ్ సక్సెస్ అందుకోవాలని కష్టపడుతున్నాడు. చివరిగా విజయ్ నుంచి వచ్చిన ఫ్యామిలీ స్టార్ సినిమా ఊహించని ఫలితాన్నీ అందుకున్న విషయం తెలిసిందే. ంఆఎఇఖీమోఇఓఇఔ అయినప్పటికీ తన కాన్ఫిడెన్స్ కోల్పోకుండా ఈ హీరో తదుపరి సినిమా కోసం ఎంతో బలంగా సిద్ధమవుతున్నాడు. అంతకుముందు కూడా లైగర్ తో నిరాశను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో చేస్తున్న సినిమాపై ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ రెండు విభిన్నమైన పాత్రలలో కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. ంశ్రీబనీ ఖీవజీట – పుష్ప 2పై అనుమానాలు.. మాట ఇచ్చిన నిర్మాత ముఖ్యంగా కానిస్టేబుల్ పాత్ర చాలా ప్రత్యేకంగా ఉండబోతుందట. అలాగే ఒక ఖైదీగా కూడా అతను ఈ సినిమాలో నట విశ్వరూపం చూపిస్తాడు అని టాక్ అయితే వినిపిస్తుంది. దానికోసం ప్రత్యేకంగా ఒక లుక్ కూడా సెట్ చేసుకున్నాడు. అందుకు సంబంధించిన పోస్టర్ కూడా ఆడియన్స్ లో పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ చేసింది. అయితే విజయ్ బయట ఎక్కడ కనిపించినా కూడా టోపీతో కనిపిస్తూ ఉన్నాడు. తన హెయిర్ స్టైల్ ఎలా ఉంటుంది అనే విషయంలో కాస్త సస్పెన్స్ క్రియేట్ చేస్తూ ఉన్నాడు. అంతే కాకుండా గడ్డం కూడా గట్టిగా పెంచాడు. ఏదో హై వోల్టేజ్ క్యారెక్టర్ అతని నుంచి రాబోతున్నట్లుగా అర్థమవుతుంది. ఇక సోషల్ మీడియాలో ఇటీవల మరి కొన్ని ఫోటోలు పోస్ట్ చేశాడు. నిన్న మొన్నటి వరకు వరుస షెడ్యూల్స్ తో బిజీగా ఉన్న విజయ్ దేవరకొండ ఇప్పుడు రెస్ట్ తీసుకునే పనిలో ఉన్నాడు. ంశ్రీబనీ ఖీవజీట – ఏడాదిలోనే స్టార్ హీరో 1000 కోట్ల సంపాదన స్విమ్మింగ్ పూల్ లో అలా సేదతీరుతూ కనిపించాడు. అలాగే మరికొన్ని స్టిల్స్ లో అతను టోపీ పెట్టుకునే కనిపించాడు. ఇది టోపీ దశ అంటూ.. ఏదో సస్పెన్స్ అయితే క్రియేట్ చేస్తున్నాడు. ఇప్పట్లో విజయ్ తన పూర్తి లుక్ లో కనిపించేలా లేదు అనిపిస్తుంది.

## అందానికే మరో అందం....



## ఏడాదిలోనే స్టార్ హీరో 1000 కోట్ల సంపాదన

బాలీవుడ్ లో పాపులర్ తారలు షారుఖ్ ఖాన్, జూహీ చావ్లా, హృతిక్, అమితాబ్ షోబిజ్‌లోని అత్యంత ధనవంతులైన సెలబ్రిటీల జాబితాలో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. వారంతా తెలివైన పెట్టుబడులతో భారీగా ఆస్తులను కూడగట్టుకున్నారు. ప్రొడక్షన్ కంపెనీలు, రియల్ ఎస్టేట్ సహా రకరకాల సైడ్ వెంచర్‌ల ద్వారా భారీ విజయాన్ని సాధించారు. అయితే వీరందరిలో షారూఖ్ రేసులో అగ్రపథంలో దూసుకుపోతున్నారు. ంఆఎఇఖీమోఇఓఇఔ 2024 హురున్ ఇండియా రిచ్ లిస్ట్ జాబితా ప్రకారం.. రూ. 7,300 కోట్ల నికర ఆస్తి విలువతో షారూఖ్ ఖాన్ అగ్రస్థానంలో ఉన్నారని, వినోదం క్రీడలలో తమ వెంచర్‌ల ద్వారా రూ. 4,600 కోట్లు సంపాదించిన జూహీ చావ్లా, ఆమె కుటుంబం తర్వాతి స్థానంలో ఉన్నారని హురున్ ఇండియా రిచ్ లిస్ట్ వెల్లడించింది. ఆసక్తికరంగా షారూక్ ఖాన్ ఆస్తులు గత ఏడాది 6300 కోట్లు ఉండగా, ఈ ఏడాది ఈ నికర ఆస్తి విలువ ఏకంగా 1000 కోట్లు పెరిగి టోటల్ గా 7,300 కోట్ల మార్క్ కి చేరుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మాట ఇచ్చిన నిర్మాత పారితోషికాలు, సినిమాల నిర్మాణం, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లలో షారూఖ్ విజయవంతమైన ప్రయాణం సాగించారు. షారుఖ్ ఖాన్ సంపద పెరుగుతూనే ఉంది. అతడు నటించిన వరుస చిత్రాలు విజయాలు సాధించాయి. పఠాన్, జవాన్ – డంకీ ఫలితాలు ఖాన్ లో ఉత్సాహం పెంచాయి. నిర్మాణ సంస్థ రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్ సైతం పురోభివృద్ధిని సాధించింది. షారూక్ ఖాన్ ప్రభావం ఇతర వాణిజ్య పరిశ్రమలకు కూడా విస్తరించింది. అతడు అత్యంత డిమాండ్ ఉన్న బ్రాండ్ అంబాసిడర్. అనేక ఉత్పత్తులకు ప్రమోటర్ గా సేవలను ఆమోదించాడు. అతడి అపారమైన పాపులారిటీ -సోషల్ మీడియా ఫాలోయింగ్ భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించాలని చూస్తున్న బ్రాండ్‌లకు లాభదాయకమైన ప్రతిపాదనగా మారాయి. హురున్ ఇండియా రిచ్ లిస్ట్-2024 బాలీవుడ్ స్టార్‌లను ముఖ్యమైన సంపద సృష్టికర్తలుగా హైలైట్ చేసింది. 2000 కోట్ల నికర ఆస్తులతో గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. సినిమాల్లో నటించడమే కాకుండా హృతిక్ ఫిట్‌నెస్ బ్రాండ్ ఊఖీచీని కూడా కలిగి ఉన్నాడు. వస్త్ర వ్యాపారంలోను సక్సెస్ సాధించాడు. అమితాబ్ బచ్చన్ సహా అతడి కుటుంబం రూ.1,600 కోట్ల ఆస్తులతో నాలుగో స్థానంలో ఉండగా, నిర్మాత కరణ్ జోహార్ నికర ఆస్తుల విలువ రూ.1,400 కోట్లు అని తెలుస్తోంది.






## షూటర్ అవని పసిడి గర్జన.. కాంస్యంతో మెరిసిన మోనా అగర్వాల్




పారిస్ వేదికగా జరుగుతున్న పారిలింపిక్స్‌లో భారత షూటర్లు పతక గర్జన చేశారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో అవనీ లేఖరా పసిడి పతకం కొల్లగొట్టింది. రికార్డు స్కోర్‌తో చరిత్ర సృష్టించిన ఆమె దేశానికి తొలి పతకం అందించింది. టోక్యో పారిలింపిక్స్‌లోనూ స్వర్ణం సాధించిన ఆమెకు ఇది రెండో గోల్డ్ మెడల్. ఇక ఇదే పోటీల్లో భారత పారా షూటర్ మోనా అగర్వాల్ కాంస్య పతకంతో మెరిసింది.పారాలింపిక్స్‌లో భారత్ స్వర్ణంతో పతకాల ఖాతా తెరిచింది. అది కూడా షూటర్ల తరఫున దేశం తొలి పతకం అందుకుంది. శుక్రవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో అవని లెఖారా, మోనాల గురి అదిరింది. అవనిరెండో స్థానంలో నిలువగా, మోనా అగర్వాల్ ఐదోస్థానం సాధించింది. దాంతో ఇద్దరూ ఫైనల్లోకి దూసుకెళ్లారు.ఆద్యంతం ఉత్కంఠ రేపిన ఫైనల్లో తొలుత అవని వెనకబడింది. అయితే.. తొలి రౌండ్ నుంచి ముందంజలో ఉన్న దక్షిణ కొరియా పారా షూటర్ లీ యున్రీ(ఒవవ జబీనితీ)ఆఖరి రౌండ్‌లో తడబడింది. యున్రీ 6.8 పాయింట్లకే పరిమితమవ్వగా.. అవని చెక్కు చెదరని గురితో 10.5 పాయింట్లు సాధించింది. దాంతో, మొత్తంగా 249.7 పాయింట్లతో రికార్డు నెలకొల్పిన భారత పారా షూటర్ పసిడి వెలుగులు విరజిమ్మింది.క్వాలిఫికేషన్ రౌండ్‌లో మెరిసిన మోనా అగర్వాల్ మాత్రం ఫైనల్లో అంచనాలు అందుకోలేకపోయింది. 228.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి మోనా కంచు మోత మోగించింది. దాంతో, ఒకే ఈవెంట్‌లో ఇద్దరు భారత పారా షూటర్లు రెండు పతకాలతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు

## ఆటపట్టు విధ్వంసం.. రెండో టైటిల్ ముద్దాడిన రాయల్స్

మహిళల కరీబియన్ ప్రీమియర్ లీగ్ మూడో సీజన్‌లో బార్బడోస్ రాయల్స్( చాంపియన్‌గా అవతరించింది. తొలి సీజన్ విజేత ట్రిన్‌బగో నైట్ రైడర్స్‌కు షాకిచ్చి వరుసగా రెండోసారి కప్‌ను కొల్లగొట్టింది. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్లో హేలీ మాథ్యూస్‌సారథ్యంలోని బార్బడోస్ నాలుగు వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది. పేసర్ అలియాహ్ అల్లెనె(21/4)బంతితో టీకేర్‌ను కుప్పకూల్చగా.. అనంతరం చమరి ఆటపట్టు (39 నాటౌట్) దంచికొట్టడంతో బార్బడోస్ జట్టు విజేతగా నిలిచింది.డబ్ల్యూసీపీఎల్ మూడో సీజన్ ఆరంభం నుంచి అదరగొట్టిన బార్బడోస్ జట్టు ఫైనల్లోనూ దుమ్మురేపింది. తొలి సీజన్ చాంపియన్ ట్రిన్‌బగ్ నైట్ రైడర్స్‌ను చిత్తుగా ఓడించి రెండో ట్రోఫీని ముద్దాడింది. బ్రియాన్ లారా స్టేడియంలో టాస్ గెలిచి ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించిన రాయల్స్.. ట్రిన్‌బగ్ నైట్ రైడర్స్ బ్యాటర్లకు కళ్లెం వేసింది.పేసర్ అలియాహ్ అల్లెనె 4 వికెట్లతో టీకేఆర్ టాపార్డర్‌ను కుప్పకూల్చింది. ఆమె చెలరేగడంతో టీకేఆర్ అమ్మాయిలంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఆల్‌రౌండర్ శిఖా పాండే (28 ) ఒంటరి పోరాటం చేసింది. దాంతో ట్రిన్‌బగో నైట్ రైడర్స్ 8 వికెట్ల నష్టానికి 93 రన్స్ కొట్టింది.ఆ తర్వాత ఛేదనలో బార్బడోస్ రాయల్స్ స్టార్ చమరి ఆటపట్టు(39 నాటౌట్) టీకేఆర్ బౌలర్లను ఆడుకుంది. దాంతో, రాయల్స్ 4 వికెట్ల తేడాతో గెలుపొంది చరిత్ర సృష్టించింది. సంచలన స్పెల్‌తో మ్యాచ్‌ను మలుపుతిప్పిన అలియాహ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఇక టోర్నీ ఆసాంతం రాణించిన మాథ్యూస్ (147 పరుగులు, 11 వికెట్లు) 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు అందుకుంది.




## వర్షాకాలం వచ్చిందంటే.. ఐ లవ్ బనానా అనాల్సిందే, అనడమే కాదు మస్తుగా తినాల్సిందే!



వర్షాకాలం వచ్చిందంటే చాలు.. పెద్ద ఎత్తున సీజనల్ వ్యాధులు వస్తుంటాయి. ముఖ్యంగా కండ్లకలక, జలుబు, మోషన్స్.. ఇలా చాలా వస్తుంటాయి. వీటిని తగ్గించుకోవడానికి ఆస్పత్రులు చుట్టూ తిరగడం కంటే రాకముందే జాగ్రత్త పడడం చాలా మంచిది.ముఖ్యంగా ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో మాంసాహారం తీసుకున్నా చాలా మందికి పడదు. డైజెస్ట్ కూడా సరిగ్గా అవ్వదు. కడుపు నొప్పిగా ఉంటుంది. అందుకే సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం చాలా మంచిది.అరటి పండు చాలా మంచిది. వర్షాకాలంలో అరటి పండు తినడం వల్ల అజీర్తి వంటి సమస్యలు దూరం అవుతాయి. పొట్టకి చాలా హాయిగా ఉంటుంది. అరటి పండ్లు తినడం వల్ల ఎన్నో రకాల బెనిఫిట్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని కూడా కాపాడతాయి. అరటి పండ్లలో కార్బో హైడ్రేట్స్ అత్యధికంగా ఉంటాయి. పిండి పదార్థాలు ఉ?నన ఆహారం తీసుకుంటే శరీరానికి కావాల్సిన శక్తి మెండుగా అందుతుంది. ఉదయాన్నే వీటిని తినడం వల్ల శక్తి వస్తుంది.గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది:అరటి పండ్లలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పొటాషియం రక్తపోటును తగ్గిస్తుంది. అంతే కాకుండా దీన్ని తీసుకోవడం వల్ల స్ట్రోక్ వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. వర్షాకాలంలో జీర్ణ సమస్యలు ఎక్కువగా వస్తాయి. తీసుకున్న ఆహారం జీర్ణం కాకపోవడం వల్ల కడుపులో మంట, కడుపు నొప్పి వస్తుంది. అలాగే అరటి పండ్లలోని పెక్టిన్ అనే ఫైబర్ జీర్ణక్రియని మెరుగ్గా చేసి కడుపు నొప్పి, విరోచనాలకి ట్రీ ట్ మెంట్ గా వాడవచ్చు.రోగనిరోధక శక్తిని పెంచి రోగాలను దరిచేరనీయదు:అలాగే రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ అరటి పండు ముందు ఉంటుంది. అరటి పండులో ఉండే బీ6, మెగ్నీషియం, పొటాషియం, ఇమ్యూనిటీని పెంచుతాయి. ఈ వర్షాకాలంలో రకరకాల వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉన్నందున.. వాటి నుంచి బయట పడాలంటే కచ్చితంగా రోగనిరోధక శక్తి ఎక్కువగా కావాల్సిందే. అయతే అరటి పండ్లను తింటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. శరీరానికి నీరు చాలా అవసరం. నీటిని సరిగ్గా తీసుకోకపోతే ఎన్నో చర్మ సమస్యలు వస్తాయి.వేసవి కాలం కంటే కూడా వర్షాకాలమే అరటి తినడం మంచిది:అరటి పం డులో 75 శాతం నీరు ఉంటుంది. దీని వల్ల శరీరం హైడ్రేట్ అవుతుంది. కొంతమంది సమ్మర్ లో మాత్రమే అరటి పండ్లను తింటారు. కానీ వీటిని వర్షాకాలంలో తినడం మరింత మంచిది. అరటి పండ్లలో విటామిన్లు, మెగ్నీషియం, పొటాషియం, బీ6లు పుష్కలంగా ఉంటాయి. అలాగే విటామిన్ సి కూడా అధికంగా ఉంటుంది. ఇది ఫ్రీ రాడికల్స్ దెబ్బతి నకుండా చర్మాన్ని కాపాడుతుంది. అదే విధంగా అరటి పండు తింటే చర్మం యవ్వనంగా, మెరుస్తూ ఉంటుంది.ఇన్ని పోషకాలనిచ్చే అరటి పండుకు ఐ లవ్ యూ చెప్పాల్సిందే..!అరటి పండుతో ఫేస్ ప్యాక్ కూడా వేసుకోవచ్చు. మరి ఇన్ని లాభా లు ఇచ్చే అరటి పండ్లను మీరు అస్సలే తినకుండా ఉండకూడదు. ఐ లవ్ బనానా.. బనానా..నానా అంటూ ఇష్టంగా లాగించేయాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.